కేసీఆర్ పాలనలోనే ఆర్టీసీ అభివృద్ధి

● మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: సీఎం కేసీఆర్ పాలనలోనే ఆర్టీసీ అభివృద్ధి చెందుతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రెండు సూపర్ లగ్జరీ బస్సులను ఆర్ఎం శ్రీలతతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి పాలనలో నిరాధరణకు గురైన ఆర్టీసీని తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ గాడిన పెట్టారని గుర్తు చేశారు. టీఎస్ ఆర్టీసీని లాభాల బాటలో నడిపేందుకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రతి ఏడాది సంస్థకు రూ.1500 కోట్లు ఇస్తూ సహకారం అందిస్తున్నారని తెలిపారు. 50వేల మంది ఉద్యోగులు ఉన్న అతిపెద్ద సంస్థ ఆర్టీసీ అని పేర్కొన్నారు. తొర్రూరు బస్టాండ్‌ను ఆధునీకరిస్తామని, ప్లాట్‌ఫాంలు, ఫ్లోరింగ్ చేపడతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం కృపాకర్‌రెడ్డి, డీఎం పరిమళ, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



తొర్రూరు బస్టాండ్‌లో లగ్జరీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి దయాకర్‌రావు

కార్యకర్తలకు అండగా ఉంటా..

పెద్దవంగర: కార్యకర్తలు అధైర్య పడొద్దని, అండగా ఉంటానని మంత్రి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన నిమ్మల బుచ్చి రాములు(45) అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామచంద్రయ్య శర్మ, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య, ఉప సర్పంచ్ శ్రీరాం రాము, పీఏసీఎస్ డైరెక్టర్ అనపురం రవి ఉన్నారు.

విద్వేషాలను రెచ్చగొడుతుంది

తొర్రూరు రూరల్: కుల, మతాల పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతూ బీజేపీ పబ్బం గడుపుతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని శ్రీనివాస గార్డెన్‌లో తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాలకు చెందిన ముస్లింలకు ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించి, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డేవిడ్, అధికారులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు సెలవులు ప్రకటించామని, ఎలాంటి క్రయ విక్రయాలు జరగవని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్ బుధవారం తెలిపారు. 24వ తేదీన పున:ప్రారంభమవుతుందని తెలిపారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా సత్యనారాయణ



మహబూబాబాద్: ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహితి సాంస్కృతిక కళా సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన మానుకోట రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రపు సత్యనారాయణను నియామకం చేశారు. కాగా సంస్థ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నియామకం పత్రంను బుధవారం పంపించారు.

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వీరన్న

దంతాలపల్లి: మాలమహానాడు మాల యువత జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన అనపర్తి వీరన్న నియామకం అయ్యారు. బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వీరన్నను నియమించారు.

అవిశ్వాసానికి వినతి



కొత్తగూడ: పొగుళ్లపల్లి పీఏసీఎస్ చైర్మన్, ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ దేశిడి శ్రీనివాస్ రెడ్డిపై అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయాలని డీసీఓ కుర్షిద్‌కు వినతిపత్రం అందచేశారు. శ్రీనివాస్‌రెడ్డి అన్నీ నాకే.. అన్నీ నేనే అనే తీరుగా వ్యవహరిస్తున్నట్లు డైరెక్టర్లు ఆరోపించారు. సంఘంలో ఉన్న నిధుల దుర్వినియోగానికి డైరెక్టర్లపై ఒత్తిడి చేస్తున్నట్లు డీసీఓకు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కొమ్మనబోయిన వేణు, భుక్య సురేష్, ఈసం కమలమ్మ, చల్ల నారాయణరెడ్డి, సుంకరబోయిన మొగిళి, జంపయ్య, సమ్మయ్యతో పాటు మరో ముగ్గురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



నెహ్రూసెంటర్: అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం ఆర్టీసీ ఉద్యోగులు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వర్‌రావు, ఆర్టీసీ డీఎం విజయ్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడే అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరూ షాపుల్లో, ఇళ్లలో ఫైర్ సేఫ్టీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ అజీమొద్దీన్, జగన్, సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

నెహ్రూసెంటర్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గుగులోత్ హల్యానాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం బానోత్ బాలాజీనాయక్, సత్యవతి, వరలక్ష్మీ, శైలజ, శ్రీలత, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

కేసముద్రం: ముస్లింల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని లక్ష్మీసాయిగార్డెన్‌లో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, తహసీల్దార్ ఫరీద్, సర్పంచ్ బట్టు శ్రీనివాస్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దామరకొండ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్, పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, కోఆప్షన్ మెంబర్ నజీర్, నాయకులు పాల్గొన్నారు.



కేసముద్రం: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మహబూబాబాద్: ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధుల కోసమే సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం రూ.6,63,500 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేడు జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్‌లో మున్సిపాలిటీ పరిధి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మార్నేని వెంకన్న, గద్దె రవి, గోగుల రాజు , తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్: మిషన్‌భగీరథ పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం మిషన్ భగీరథ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రధానంగా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసన్నరాణి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాస్ ఈఈ రంజిత్, ఏఈ హరీశ్, మున్సిపల్ డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్ కౌన్సిలర్లు చిట్యాల జనార్దన్, ఎడ్ల వేణుమాదవ్, నాయకులు మార్నేని రఘు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే కాంగ్రెస్ లక్ష్యం

డోర్నకల్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని పార్టీ నియోజకవర్గ నాయకుడు మాళోత్ నెహ్రూనాయక్ తెలిపారు. మండలంలోని జోగ్యాతండా, ముల్కలపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి స్థానికులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లను పేదలకు మంజూరు చేయగా కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో పేదలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు డీఎస్ జగదీష్, ఆలునాయక్, బీక్యానాయక్, రమేష్, ఫకీరానాయక్, శంకర్ నాయక్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.



జోగ్యాతండాలో పర్యటిస్తున్న నెహ్రూనాయక్

గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి



చిన్నగూడూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిన్నగూడూరు: గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వల్లూరి పద్మ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గరంగరంగా జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. శాఖల పనితీరుపై ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీరు అందడం లేదంటూ సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే రెడ్యానాయక్ మిషన్ భగీరథ అధికారులపై మండిపడ్డారు. సమావేశానికి గైర్హాజరు అయిన అధికారులకు నోటీసులు పంపించాలని ఎంపీడీఓకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యాంసుందర్, తహసిల్దార్ రామకృష్ణ, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ మంగపతిరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

తొర్రూరు రూరల్: రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో నగదు బదిలీ ద్వారానే పంపిణీ చేయాలని కోరుతూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు సంఘం నాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి బొల్లం అశోక్, నాయకులు మురళి, బుచ్చయ్య పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరుకున్న వీఓఏల దీక్ష

బయ్యారం: సమస్యల పరిష్కారం కోసం వీఓఏలు చేపట్టిన నిరవధిక దీక్ష బుధవారం మూడో రోజు కొనసాగింది. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వెంకన్న, వీఓఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వసంత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో వీఓఏలు బుధవారం నిరవధిక సమ్మెకు దిగారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెలిశాల సుధాకర్ మాట్లాడుతూ.. వీఓఏలకు రూ.26వేల జీతం ఇవ్వాల, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిల్ల నిరంజన్, రాము, రమణమ్మ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: గ్రామ దీపికల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామదీపికల సమ్మె బుధవారం గార్లలో 3 వ రోజుకు చేరుకుంది. ఈ నిరాహార దీక్షను కాంగ్రెస్ నాయకుల బృదం సందర్శించి సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, శంషాద్ బేగం, జవహర్‌లాల్, గ్రామదీపికలు ఉమ, వినోద, అనిత, అరుణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ అన్నారు. వీఓఏల నిరవధిక సమ్మె బుధవారం నాటికి 3వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, అంగన్‌వాడీ హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు స్నేహబిందు, వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు నీలం కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా ప్రధాన రోడ్డు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రం నుంచి కేసముద్రం వెళ్లే ప్రధాన రహదారి, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారింది. నీళ్లపైప్ లీకేజీ కావడంతో నీరు అంతా రోడ్డుపైకి చేరి వాహనాలు వెళ్లడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలో నీరు నిలవడంతో వర్షాకాలాన్ని తలపిస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన నీరు

బండి సంజయ్‌ని విమర్శించే హక్కు లేదు



మాట్లాడుతున్న మహేష్ గౌడ్

మరిపెడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని విమర్శించే నైతిక హక్కు మానుకోట ఎంపీ మాలోతు కవితకు లేదని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భూక్య లింగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మహేష్ మాట్లాడారు. కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషిస్తే, గతంలో మాలోతు కవిత మానుకోట లిక్కర్ దందా ప్రజలందరికి తెలుసన్నారు. మండలాన్ని రెడ్యానాయక్ ఏమి అభివృద్ధి చేశాడో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. సమావేశంలో బీజేపీ నాయకులు తాడ పూర్ణచందర్‌రెడ్డి, బింగి రమేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు భూక్య కాంతమ్మ, జనార్దన్ పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కానుకల పంపిణీ

కొత్తగూడ: మండలంలోని రైతువేదికలో ముస్లింలకు రంజాన్ కానుకలను ఎమ్మెల్యే సీతక్క బుధవారం పంపిణీ చేశారు. అనంతరం మండల సమాఖ్య ఎదుట జరుగుతున్న వీఓఎల నిరవధిక సమ్మెలో పాల్గొని న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, వైస్ ఎంపీపీ జంపయ్య, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్, సర్పంచులు రణధీర్, రాజేశ్వర్, తహసీల్దార్ చందా నరేష్, ఎంపీడీఓ భారతి పాల్గొన్నారు.

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సర్పంచ్ నున్నా జయలక్ష్మిజగన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, మండల కోఆప్షన్ సభ్యులు లాల్‌మియా రంజాన్ కానుకలను పంపిణీ చేశారు.

గార్ల: రంజాన్ కానుకలను బుధవారం స్థానిక వర్తక సంఘం భవనంలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ ముస్లింలకు అందజేశారు. అనంతరం ఇఫ్తార్‌విందు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, సర్పంచ్ మోతీలాల్, రైతుబంధు కన్వీనర్ రాధాకృష్ణ, కోఆప్షన్ సభ్యులు ఎండీ ఖదీర్, ఉమేష్, ఎస్సై బానోత్ వెంకన్న పాల్గొన్నారు.



కొత్తగూడ: రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

మొబైల్ రికవరీ.. అందజేత

● బాధితుడికి అప్పగించిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ రికవరీ చేసి సంబంధిత వ్యక్తికి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం అందజేశారు. మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వేణు మొబైల్ పోయింది. ఆ సమాచారాన్ని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ నెంబర్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈఐఆర్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి అందులో వేణు పూర్తి వివరాలు పొందుపర్చాడు. అనంతరం ఫోన్ వివరాలు తెలుసుకుని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అతడికి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ చేతుల మీదుగా సెల్‌ఫోన్ అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఎవరైనా తమ ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ నెంబర్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈఐఆర్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందుపర్చాలని సూచించారు. అలా చేస్తే త్వరగా వారి ఫోన్‌ను కనుగొనేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీకోర్ సీఐ రవికుమార్, ఎస్సై అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వేణుకు ఫోన్ అందజేస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సంక్షిప్త సమాచారం

బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సస్పెన్షన్

దంతాలపల్లి: బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రోయ్యల సురేష్‌ను పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు బుధవారం తెలిపారు. పార్టీ ఆదేశాలను దిక్కరించినందుకు గాను జిల్లా పార్టీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

చైర్మన్ పదవి ఎస్సీలకు ఇవ్వాలి

కురవి: కురవిలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్ర స్వామి ఆలయ చైర్మన్ పదవిని ఎస్సీలకు ఇవ్వాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆలయం ఎదుట సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, కాంగ్రెస్, ఇతర ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రాజన్న, నాగన్న, ఉపేందర్, వెంకన్న, రజనీకాంత్, నాగయ్య, సుధాకర్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

గార్ల: మండలం లోని అంజనాపురం గ్రామంలో ఇటీవల ఉరి వేసుకొని మృతిచెందిన మంగీలాల్ కుటుంబానికి బీఎస్పీ మండల అధ్యక్షుడు అజ్మీర వెంకన్న 25 కేజీల బియ్యంను బుధవారం వితరణ చేశారు.

సన్మానం

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలోని సీతారాంపురం ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు డి.శ్రీశైలంకు ఇటీవల జిల్లా ఉత్తమ అవార్డు దక్కింది. ఈసందర్భంగా తోటి ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.మాధురి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామ్మోహన్, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రావు, ఇందిరా, ఫిరోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పట్టించుకోండి

మహబూబాబాద్ రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సుందర్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఎంపీఓ హరిప్రసాద్‌కు బుధవారం జేపీఎస్‌లు వినతిపత్రం అందజేశారు.

విజయవంతం చేయాలి

తొర్రూరు రూరల్: మండలంలోని అన్నిగ్రామాల నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ 20న నేడు గురువారం మండల కేంద్రంలో, 24న జిల్లా కేంద్రాల్లో చేపట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపెల్లి రవి కోరారు. బుధవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేసి ఇళ్లులేని లబ్ధిదారులను గుర్తించారు. కార్యక్రమంలో నాయకులు ముంజంపెల్లి వీరన్న, చింతా నవీన్, అజ్మీర దేవేందర్, షరీఫ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని భుక్యారాంతండాజీపీ శివారు జేత్యాతండాకు చెందిన నూనావత్ రంగమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈమేరకు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ పంపిన రూ.5వేలను బుధవారం మండల అధ్యక్షుడు పాదిల నర్సింహరెడ్డి బాధితురాలికి అందజేశాడు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలి

కేసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇప్పించడంతోపాటు రూ.10లక్షలను అందించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు కన్నంతరెడ్డి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆపార్టీ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, జానకి రామయ్య, భీమా, సోమయ్య, వీరన్న, భాను పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

దంతాలపల్లి: మండల కేంద్రంలో తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్, రెడ్ బకెట్ రెస్టారెంట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన చలివేంద్రాన్ని బుధవారం స్థానిక తహసీల్దార్ శివాని, సర్పంచ్ సుస్మితతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎస్ఈయూ అధ్యక్షుడు రవిచంద్ర, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీకాంతానాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి ఫరీద్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

మరోసారి గెలిచే సత్తా ఉంది

మరిపెడ రూరల్: డోర్నకల్ నియోజకవర్గంలో మరోసారి గెలిచే సత్తా ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కే ఉందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు భూక్య ప్రవీణ్‌నాయక్ అన్నారు. మండలంలోని దంట్లకుంట తండాలో బుధవారం ఆయన మాట్లాడారు. ఆయన గెలుపుకోసం సైనికుల్లా పని చేయాలని సూచించారు. సమావేశంలో విజయ్, వసంత్, శ్రీనివాస్, తరుణ్, శశి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఆత్మహత్యాయత్నం

గార్ల: కుటుంబ కలహాలతో ఓ యువతి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం గార్లలో చోటుచేసుకుంది. గార్ల సీహెచ్‌సీ డాక్టర్ మహిరాజ్ కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్లలోని హనుమంతుడి గుడి బజారుకు చెందిన ఓ యువతి కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

50 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



కురవి: అక్రమంగా నిల్వ చేసిన 50 బస్తాల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు సీరోలు ఎస్సై ఎల్.నరేష్ తెలిపారు. బధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోద్దులగూడెం గ్రామ శివారులోని కోళ్లఫారంలో మంగళవారం అక్రమంగా నిల్వ ఉంచిన 50 బస్తాల రేషన్ బియ్యంను సీరోలు పోలీసులు, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నట్లు వివరించారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి బియ్యం బస్తాలను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన వివరించారు.

బెల్లం, పటిక పట్టివేత

గూడూరు: మండలంలోని దామరవంచ శివారు లక్ష్మితండాలో గుగులోతు లాల్‌సింగ్, వాంకుడోతు నాను ఇళ్లలో 5క్వింటాళ్ల నల్లబెల్లం, 25 కేజీల పటిక, 200లీటర్ల బెల్లం పానకం పట్టుకున్నట్లు ఎస్సై రాణాప్రతాప్ బుధవారం తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.

అదుపు తప్పిన టాటాఏస్.. ముగ్గురికి గాయాలు

దంతాలపల్లి: మండల కేంద్రంలో బొడ్లాడ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం ఓ టాటాఏస్ పల్టీకొట్టింది. వివరాలు ఖమ్మం జిల్లాకు చెందిన గొగుల మోహన్‌రావు తన టాటాఏస్ వాహనంలో అక్కలక్ష్మి, బంధువు శివరాత్రి యాదమ్మతో కలిసి సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఉంటున్న బంధువుల వివాహ వేడుకకు వెళ్తున్నారు. బొడ్లాడ క్రాస్ రోడ్డు వద్దకు రాగానే టాటాఏస్ అదుపు తప్పి రోడ్డు కిందకి దూసుకెళ్లింది. వాహనంలో ఉన్న సున్నం బస్తాలు, రంగు డబ్బాలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్స్ ప్రకాష్‌రెడ్డి, శంకర్ సంఘటన స్థలం చేరుకొని కిందపడిన డబ్బులు, బంగారం వారికి అప్పజెప్పి గాయపడిన ముగ్గురిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

కుక్క దాడిలో యువతికి గాయాలు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సాయిబాబా గుడి ఎదురుగా స్థానిక యువతిపై కుక్క దాడి చేసి గాయపర్చింది. కుక్క దాడిలో ఆమె కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండా రాజశేఖర్, 34వ వార్డు కౌన్సిలర్ గుండా స్వప్న మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దండె శ్రీహరి సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని కాటు వేసిన కుక్కను పట్టుకుని ఏబీసీ సెంటర్ తరలించారు.

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి



గార్ల: జిల్లాలో 2వ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం వెంటనే చేపట్టాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు సూత్రపు రాజుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రెండోసారి అధికారం చేపడితే గొల్లకురుమ కులస్తులకు రెండో విడత గొర్రెలు వెంటనే పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి నాలుగేళ్లు దాటినా నేటికీ గొర్రెలు పంపిణీ చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గొర్రెల పంపిణీ కార్యక్రమం త్వరితగతిన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మీగడ శ్రీనివాస్, పల్లెబోయిన లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.